క్లుప్తంగా

నేడు వాహనాల వేలం

సూర్యాపేట టౌన్: వివిధ కేసుల్లో పట్టుబడి, సీజ్ చేసిన ఏడు వాహనాలకు గురువారం సూర్యాపేట ఎక్సైజ్ స్టేషన్‌లో జిల్లా ఎక్సైజ్ అధికారి లక్ష్మణ్ నాయక్ ఆధ్వర్యంలో బహిరంగ వేలంపాట నిర్వహించనున్నట్లు సూర్యాపేట ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ మల్లయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. బహిరంగ వేలం పాటలో పాల్గొనాలనుకునేవారు ఉదయం 9 గంటలకు స్టేషన్‌లో ముందుగా ధరావతు చెల్లించాలని పేర్కొన్నారు.

ఎల్‌-24 లిఫ్టు చైర్మన్‌గా మల్లిరెడ్డి సంజీవరెడ్డి ఎన్నిక


మల్లిరెడ్డి సంజీవరెడ్డి

పెన్‌పహాడ్ : మండలంలోని అనంతారం గ్రామ శివారులో గల శ్రీవేంకటేశ్వర ఎల్‌-24 ఎత్తిపోతల పథకం (లిఫ్టు) చైర్మన్‌గా గ్రామానికి చెందిన మల్లిరెడ్డి సంజీవరెడ్డిని రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎత్తిపోతల పరిధిలోని రైతులు బుధవారం అనంతారంలో సమావేశమై ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ తనను చైర్మన్‌గా ఎన్నుకున్నందుకు రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో గజ్జెల సైదిరెడ్డి, రాఘవరెడ్డి, గొర్ల అంజయ్య, మామిడి సైదులు, రాంబాబు, దంతాల వెంకన్న, రవి, శెనగాని రాంబాబు, జానీ, సైదిరెడ్డి, వినోద్, నాగయ్య, కిరణ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ తోటలు సాగుచేయాలి

అర్వపల్లి: నీటి వసతి ఉన్న రైతులు వరి పంటకు ప్రత్యామ్నాయంగా ఆయిల్‌పామ్ తోటలను సాగుచేయాలని మండల వ్యవసాయ విస్తరణ అధికారి(ఏఈఓ) నేరెళ్ల సత్యం కోరారు. జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం రైతు వేదికలో బుధవారం ఆయిల్‌పామ్ సాగుపై ఉద్యానశాఖ, పతంజలి ఆయిల్‌పామ్ కంపెనీల ఆధ్వర్యంలో రైతులకు నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. తోటలపెంపకం చేపట్టి నెలనెలా ఆదాయం పొందాలన్నారు. సమావేశంలో కంపెనీ ఫీల్డ్ అధికారి అశోక్, క్షేత్ర సహాయకుడు రంగు ముత్యంరాజు, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అవగాహన

నూతనకల్: సీజనల్ వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగిఉండాలని నూతనకల్ మండల వైద్యాధికారి కె.అశ్రితారెడ్డి అన్నారు. బుధవారం నూతనకల్ మండలం పెదనెమిల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై నిర్వహించిన అవగాహన సమావేశంలో ఆమె మాట్లాడారు. విద్యార్థులు వ్యక్తిగత, పరిసరాల శుభ్రతను పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ శరత్, పాఠశాల హెచ్‌ఎం శివయ్య, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధ దంపతులకు సాయం


సరుకులు అందజేస్తున్న తహసీల్దార్

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండల కేంద్రంలోని రింగు ముత్తయ్యకు చెందిన పెంకుటిల్లు వర్షాలకు నాని గోడలు పాక్షికంగా దెబ్బతిన్నంది. దీంతో ప్రభుత్వ పరంగా బుధవారం ఆ కుటుంబానికి తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు ఆర్థిక సాయమందించారు. ఈ శిథిలమైన ఇంటిలో ముత్తయ్య-వెంకటమ్మ వృద్ధ దంపతులు ఉంటున్నారని, వీరికి రూ.8వేల నగదు, బియ్యం, ఇతర నిత్యావసర సరుకులను అందజేసినట్లు చెప్పారు. ఇల్లు కూలిపోయే స్థితిలో ఉండగా ఆ దంపతులను సమీపంలో ఉన్న రింగు నరహరి ఇంట్లోకి పంపినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ రామరాజు జలంధర్‌రావు, గిర్దావర్ పాటి వెంకట్‌రెడ్డి, బింగి కృష్ణమూర్తి, నరహరి పాల్గొన్నారు.

కాలేజీ మంజూరుపై హర్షం

అర్వపల్లి: తిరుమలగిరికి ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు పట్ల బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్ష, ఉపాధ్యక్షులు అనిరెడ్డి రాజేందర్‌రెడ్డి, నర్సింగ శ్రీనివాస్‌గౌడ్, మండల అధ్యక్షుడు మోరపాక సత్యం, యూత్‌కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శిగ నసీర్‌గౌడ్ హర్షం వ్యక్తం చేశారు. బుధవారం వారు అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడుతూ సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి ఉత్తంకుమారెడ్డి, ఎమ్మెల్యే సామేలులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ విద్యాసంవత్సరానికి సంబంధించి కళాశాలలో చేరడానికి అడ్మిషన్లు ప్రారంభిస్తున్నారని, విద్యార్థులు చేరాలని కోరారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

అర్వపల్లి: అర్వపల్లిలోని రెండు జాతీయ రహదారులు కలిసే వై జంక్షన్‌లో రోడ్డు ప్రమాదాల నివారణకు హైవే అధికారులు చర్యలు తీసుకోవాలని పూలే, అంబేద్కర్ ఆశయ పోరాటసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు ఈదురు వీరపాపయ్య విజ్ఞప్తి చేశారు. బుధవారం ఆయన అర్వపల్లిలో విలేకరులతో మాట్లాడారు. అన్ని వైపులా సెంట్రల్ లైట్లు వేయడంతో పాటు స్పీడ్ బ్రేకర్లకు రేడియం స్టిక్కర్లు వేయాలని కోరారు. పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలు పనిచేసేలా చూడాలన్నారు.

ఎల్‌-24 ఎత్తిపోతల నడిచేదెలా!

- లిఫ్టు వద్ద ఆరు నెలల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ చోరీ
- నేటికీ కొత్తది ఏర్పాటు చేయని యంత్రాంగం
- సాగర్ నీరు విడుదల కావడంతో రైతుల్లో ఆందోళన
- సాగునీరందేలా చూడాలని వేడుకోలు


అనంతారంలోని ఎల్‌-24 ఎత్తిపోతల పథకం


లిఫ్టు వద్ద ఒక్కటే కనిపిస్తున్న ట్రాన్స్‌ఫార్మర్

పెన్‌పహాడ్: సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేసినా పెన్‌పహాడ్ మండలం అనంతారంలోని ఎల్‌-24 శ్రీవెంకటేశ్వర ఎత్తిపోతల పథకం (లిఫ్టు) కింద రైతులకు సాగునీరందని పరిస్థితి నెలకొంది. దీంతో ఎత్తిపోతల ఆయకట్టులోని మూడు గ్రామాల రైతులు తీవ్ర ఆందోళన చెంతుతున్నారు.

ట్రాన్స్‌ఫార్మర్ చోరీకి గురుకావడంతో..

సాగర్ ఎడమ కాల్వపై అనంతారం గ్రామ శివారులో చాలా ఏళ్లక్రితం ఎల్‌-24 లిఫ్టును ఏర్పాటు చేశారు. దీనిద్వారా మండలంలోని అనంతారం, పొట్లపహాడ్, పెన్‌పహాడ్ గ్రామాల్లో సుమారు 1,670 ఎకరాల భూమికి సాగునీరు అందుతోంది. ఎల్‌-24 ఎత్తిపోతల పథకం నడిచేందుకు రెండు ట్రాన్స్‌ఫార్మర్లు ఏర్పాటుచేయగా ఇందులో ఒకటి ఆరు నెలల క్రితం అపహరణకు గురైంది. 400కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని కాపర్‌తో పాటు ఆయిల్‌ను దుండగులు అపహరించారు. కానీ నేటికీ ఆ ఎత్తిపోతల పథకానికి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయలేదు. అయితే ప్రస్తుతం ప్రభుత్వం సాగర్ ఎడమ కాల్వకు సాగునీటిని విడుదల చేయడంతో రైతాంగం వానాకాలం సాగుకు సన్నద్ధం అవుతున్న వేళ ఎల్‌-24 ఎత్తిపోతల నడిచేందుకు రెండింటిలో ఒక ట్రాన్స్‌ఫార్మర్ లేకపోవడంతో రైతన్నలకు సాగునీందని పరిస్థితి. వరిసాగు సీజన్ మొదలైనందున రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించి నూతన ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయించి సాగునీరు అందించాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

ప్రత్యేక చొరవ తీసుకోవాలి

సాగర్ ఎడమ కాల్వపై ఉన్న ఎల్‌-24 ఎత్తిపోతల పథకానికి సంబంధించిన ఒక ట్రాన్స్‌పార్మర్ చోరీకి గురికావడంతో నీరు ఉన్నా ఎత్తిపోయలేని పరిస్థితి. సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రత్యేక చొరవ తీసుకుని వెంటనే ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేసి ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని అందించాలి.

– రంగారెడ్డి, రైతు, అనంతారం

ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయాలి

సాగర్ ఎడమ కాల్వకు ప్రభుత్వం సాగునీటిని విడుదల చేయడం హర్షణీయం. ఎల్‌-24 ఎత్తిపోతల పథకం వద్ద చోరీకి గురైన ట్రాన్స్‌ఫార్మర్ స్థానంలో నూతన ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేయపోవడంతో ఆయకట్టు రైతాంగం ఆందోళనకు గురవుతోంది. తక్షణమే కొత్త ట్రాన్స్‌పార్మర్ ఏర్పాటు చేసి రైతాంగాన్ని ఆదుకోవాలి.

– నాగయ్య, రైతు, పొట్లపహాడ్

మెరుగైన వైద్యం అందించాలి

- కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్


రోగులతో మాట్లాడుతున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, డైరెక్టర్ అర్చన సురేష్

సూర్యాపేట టౌన్, భానుపురి, చివ్వెంల: ప్రభుత్వ ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ డైరెక్టర్ అర్చన సురేష్‌తో కలిసి కలెక్టర్ సందర్శించి మాట్లాడారు. అనంతరం డైరెక్టర్ అర్చన సురేష్ మాట్లాడుతూ నిరుపేదలకు విద్య, వైద్యరంగాల్లో మౌలిక సదుపాయాలు కల్పించడానికి పర్యటిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చికిత్స ఎలా అందుతుందని రోగులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా కలెక్టరేట్‌లో దివ్యాంగులకు తెలంగాణ సోషల్ ఇంపాక్ట్ గ్రూప్ ఆధ్వర్యంలో బ్రింగ్ ఏ స్మైల్ ఫౌండేషన్ సహాయంతో 28 వీల్ చైర్లు పంపిణీ చేశారు. ఆ తర్వాత చివ్వెంల మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ గిరిజన బాలికల పాఠశాలను తనిఖీ చేశారు. పాఠశాలలకు సంబంధించిన పలు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ శ్రీకాంత్, డీఈఓ అశోక్, డాక్టర్ గురురాజ్, డాక్టర్ జనార్దన్, జిల్లా సంక్షేమ అధికారి కే.నరసింహరావు, ఏఓ సుదర్శన్ రెడ్డి, చివ్వెంల కేజీబీవీ ప్రిన్సిపాల్ నాగలక్ష్మి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.


దివ్యాంగులకు వీల్‌చైర్లను అందిస్తున్న కలెక్టర్ తేజస్ నంద్‌లాల్ పవార్, తదితరులు

ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషి


కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న మాజీ మంత్రి ఆర్డీఆర్

సూర్యాపేట: తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీల సంక్షేమానికి కృషిచేస్తానని మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్‌రెడ్డి అన్నారు. ఈనెల 13న జరగనున్న జిల్లా ఆర్‌ఎంపీ, పీఎంపీల వెల్ఫేర్ అసోసియేషన్ 12వ మహాసభ కరపత్రాన్ని బుధవారం సూర్యాపేటలో ఆవిష్కరించి మాట్లాడారు. పేదలకు అందుబాటులో ఉంటూ నిరంతరం వైద్యసేవలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పుప్పాల లక్ష్మీనర్సయ్య, ఉపాధ్యక్షుడు ఎస్‌కె.రహమతుల్లా, ప్రధాన కార్యదర్శి పొలిశెట్టి రాజేందర్, కోశాధికారి జెర్రిపోతుల లక్ష్మయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ డాంగే ఆర్గనైజింగ్ సెక్రటరీ కూకటి రాజబాబురెడ్డి, నాగరాజు, కుమ్మరి వెంకన్న పాల్గొన్నారు.

వరద బాధితులకు అండగా ఉండాలి


సూర్యాపేట : విరాళాలు సేకరిస్తున్న సీఐటీయూ నాయకులు

సూర్యాపేట: కేరళ రాష్ట్రంలోని వయనాడ్ వరద బాధితులకు అండగా ప్రతి ఒక్కరూ ఉండాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి నెమ్మాది వెంకటేశ్వర్లు ప్రజలను కోరారు. బుధవారం సూర్యాపేట పట్టణంలో వరద బాధితులకు సహాయ నిధి కోసం విరాళాలు సేకరించారు. ఈ సందర్భంగా నెమ్మాది వెంకటేశ్వర్లు మాట్లాడారు. వయనాడ్ బాధితులకు సంఘీభావం ప్రకటించి విరాళాలు అందించిన వారికి ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు ఎం.రాంబాబు, జిల్లా కమిటీ సభ్యులు వి.సాయికుమార్, పిండిగా గోపి, కోడి ఎల్లయ్య, ప్రవీణ్ రెడ్డి, నవీన్ లక్కపాక, నెమ్మాది లింగయ్య తదితరులు పాల్గొన్నారు.

తుంగతుర్తి: కేరళ వరద బాధితుల సహాయార్థం తుంగతుర్తిలో బుధవారం సీపీఎం నాయకులు విరాళాలు సేకరించారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు కొలిశెట్టి యాదగిరిరావు, జిల్లా కమిటీ సభ్యులు బుర్ర శ్రీనివాస్, మండల కమిటీ సభ్యులు ముత్తయ్య, సీనియర్ నాయకులు ఓరుగంటి అంతయ్య పాల్గొన్నారు.

ఎస్సీల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలి


వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మద్దిరాల: ఎస్సీ డిక్లరేషన్ ప్రకారం ఎస్సీల సంక్షేమానికి తగిన నిధులు కేటాయించాలని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి వంగూరి రమేష్, మండల అధ్యక్షుడు సుధాల సుధాకర్ డిమాండ్ చేశారు. బుధవారం మద్దిరాల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ అమీన్‌సింగ్‌కు పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రం అందజేసి మాట్లాడారు. అంబేద్కర్ అభయహస్తం కింద ప్రతి కుటుంబానికి రూ.12లక్షల ఆర్థిక సహాయం అందజేయాలన్నారు. ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన మాల, మాదిగ కార్పొరేషన్లకు రూ.750కోట్లు కేటాయించాలన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు భూతం సాగర్, నాయకులు బి.ఉపేందర్, బాలు, వీరన్న పాల్గొన్నారు.

ఎంసీపీఐయూను బలోపేతం చేయాలి


సమావేశంలో మాట్లాడుతున్న మట్టయ్య

సూర్యాపేట: జిల్లాలో ఎంసీపీఐయూ బలోపేతానికి ప్రతిఒక్కరూ కృషిచేయాలని ఆ పార్టీ జిల్లా ఇన్‌చార్జి వస్కుల మట్టయ్య అన్నారు. బుధవారం సూర్యాపేట పట్టణంలోని రైస్ మిల్లర్స్ బిల్డింగ్‌లో ఆ పార్టీ నాయకుడు వేముల పెద్ద నరసయ్య అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాటాల పురిటిగడ్డ సూర్యాపేట కేంద్రంగా సాగిన సాయుధ పోరాటానికి బీఎన్.రెడ్డి, ఓంకార్ నాయకత్వం వహించి పది లక్షల ఎకరాల భూమిని పేద ప్రజలకు పంచారని తెలిపారు. వారి వారసత్వాన్ని పునికి పుచ్చుకొని ప్రజా సమస్యలపై పోరాటాలకు సిద్ధం కావాలన్నారు. సమావేశంలో ఆ పార్టీ జిల్లా కార్యదర్శి నజీర్, రాష్ట్ర నాయకులు వరికుప్పల వెంకన్న, లింగంపల్లి రాజు, మోరపాక ఉగ్రాయ, బచ్చుకోటయ్య, ఉమేష్, నరసయ్య, వెంకన్న, శ్రీను, వేణు, రమేష్, ఓంకార్ తదితరులు పాల్గొన్నారు.

నూతన సాగు పద్ధతులు అవలంబించాలి


రైతులకు డ్రమ్‌సీడర్ అందిస్తున్న ప్రతినిధులు

ఆత్మకూర్ (ఎస్): వ్యవసాయ రంగంలో నూతన సాగు పద్ధతులు అలంబిస్తూ అధిక దిగుబడులు సాధించాలని పీఐ ఫౌండేషన్ రీజనల్ మేనేజర్ కిషోర్, గడ్డిపల్లి కేవీకే శాస్త్రవేత్తలు డి.నరేష్, కిరణ్ అన్నారు. బుధవారం ఆత్మకూర్ (ఎస్)మండల కేంద్రంలోని రైతు వేదికలో నూతన సాగు పద్ధతులపై రైతులకు నిర్వహించిన శిక్షణలో ఆయన మాట్లాడారు. డ్రమ్ సీడర్, వెదజల్లే పద్ధతులతో సమయం, డబ్బులు ఆదా చేసుకోవచ్చన్నారు. అనంతరం రైతు ఉత్పత్తిదారుల సంఘానికి మూడు డ్రమ్ సీడర్లను ఉచితంగా అందించారు. ఈ కార్యక్రమంలో గ్రాంట్ తాంటన్ సంస్థ డైరెక్టర్ తిరుపతిరావు, ప్రతినిధులు రాధ, అలీషా, సార్థక్, నాబార్డ్ అధికారి సత్యనారాయణరావు, ఎస్‌బీఐ అధికారులు అనిల్, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అధిక ఫీజులు వసూలు చేస్తే చర్యలు తీసుకోవాలి

సూర్యాపేట టౌన్: అక్రమంగా అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలపై చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఆవుల నాగరాజు అన్నారు. బుధవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఆ సంఘం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఫీల్డ్ ట్రిప్, ప్రాజెక్టు వర్క్, సాంస్కృతిక, ఇతర కార్యక్రమాల పేరుతో రూ.వేలల్లో వసూలు చేస్తున్న ఫీజులను తిరిగి విద్యార్థుల తల్లిదండ్రులకు చెల్లించాలని డిమాండ్ చేశారు. అర్హతలేని డ్రైవర్లతో ఫిట్నెస్ లేని బస్సులు నడుపుతూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నా డీఈఓ స్పందించడం లేదన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా కన్వీనర్ మరికంటి హరీష్, జి.శ్యామ్, అజయ్‌కుమార్, సాయి, వేల్పుల మల్లేష్ తదితరులు పాల్గొన్నారు.

మురుగునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలి


సూర్యాపేట : రోడ్డు గుంతల్లో మట్టి పోస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ

సూర్యాపేట: ప్రస్తుత వర్షాకాలంలో ప్రజలు తమ ఇళ్ల పరిసరాల్లో మురుగు, వర్షపునీరు నిల్వ ఉండకుండా చూసుకోవాలని సూర్యాపేట మున్సిపల్ చైర్‌పర్సన్ అన్నపూర్ణ అన్నారు. స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం మూడో రోజు జిల్లా కేంద్రంలోని 9, 48, 47 వార్డుల్లో మురుగు కాల్వల్లో మట్టితోపాటు, వీధుల్లోని నీటి గుంతలను పూడ్చారు. ఈ సందర్భంగా 48వ వార్డు కౌన్సిలర్ వెలుగు వెంకన్న ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్లో రోడ్లను పూడ్చారు. ఆయా వార్డులో ఆమె మాట్లాడారు. కార్యక్రమంలో మున్సిపల్ డీఈ సత్యారావు, ఏఈ వరుణ్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సారగండ్ల శ్రీనివాస్, సతీష్,హెల్త్ అసిస్టెంట్ సురేష్, ఎన్విరాన్‌మెంట్ ఇంజనీర్ సీహెచ్.శివప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు ఖమ్మంపాటి రేణుబాబు, బొల్లిశెట్టి మధు, అంజమ్మ, కాంగ్రెస్ నాయకులు కుమ్మరికుంట్ల వేణు,ఎవార్డ్ ఆఫీసర్లు, వార్డు జవాన్లు, శానిటేషన్ సిబ్బంది, ఆశ వర్కర్లు, అంగన్‌వాడీ టీచర్లు, వార్డు డెవలప్‌మెంట్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అర్వపల్లి: స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా బుధవారం రామన్నగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణను గ్రామ పంచాయతీ కార్మికులు శుభ్రం చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఉపేందర్‌రావు, హెచ్‌ఎం ధర్మయ్య, సిబ్బంది నాగార్జున్, నర్సయ్య పాల్గొన్నారు.

పెన్‌పహాడ్: పారిశుద్ధ్య నిర్వహణ ప్రతి ఒక్కరి బాధ్యతని పెన్‌పహాడ్ ఎంపీడీఓ వెంకటేశ్వరరావు అన్నారు. బుధవారం పెన్‌పహాడ్ మండలం గూడెపుకుంట తండాలో స్వచ్ఛదనం-పచ్చదనం కార్యక్రమంలో భాగంగా మురుగు కాల్వలు శుభ్రం చేయించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి బచ్చలకూరి సతీష్, సిబ్బంది పాల్గొన్నారు.

నూతనకల్: ప్రతిఒక్కరూ పచ్చదనం, పరిశుభ్రతకు పాటుపడాలని నూతనకల్ ఎంపీడీఓ సునిత అన్నారు. బుధవారం నూతనకల్‌తోపాటు వివిధ గ్రామాల్లో నిర్వహించిన స్వచ్ఛందనం-పచ్చదనం కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో ఎంపీఓ శశికళ, ఏపీఓ శ్రీరాములు, మాజీ సర్పంచ్ సత్యనారాయణగౌడ్ పాల్గొన్నారు.

కార్యదర్శికి సన్మానం

పెన్‌పహాడ్: మండలంలోని చినగారకుంట తండాకు చెందిన పంచాయతీ కార్యదర్శి బచ్చలకూరి సతీష్‌కుమార్ ఇటీవల మండలంలోని గూడెపుకుంటతండాకు బదిలీపై వెళ్లారు. దీంతో బుధవారం పెదగారకుంట తండాలోని ప్రాథమిక పాఠశాలలో హెచ్‌ఎం రాంజీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శాలిబాయి, పంచాయతీ కార్యదర్శి శ్రీను, మాజీ ఉప సర్పంచ్ మంగమ్మ, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రాజెక్టుల సందర్శన

తుంగతుర్తి: మండలంలోని సూర్యనాయక్ తండా గ్రామ పంచాయతీ రైతులు బుధవారం కాళేశ్వరం, మేడిగడ్డ, అన్నారం, ఎస్సారెస్పీ ప్రాజెక్టులను సందర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి, బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్‌రెడ్డిని కలిశారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో తుంగతుర్తి, సూర్యాపేట ప్రాంతాలకు ఎస్సారెస్పీ కాలువల ద్వారా మీరు నీరందించారని, నేటి ప్రభుత్వం ఇంకా నీటిని విడుదల చేయకపోవడంతో తాము ఇబ్బందులు పడుతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు.

తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష


తిరుమలగిరి : మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ అనసూయ

తిరుమలగిరి: తల్లిపాలే బిడ్డకు శ్రీరామరక్ష అని తిరుమల మున్సిపల్ చైర్పర్సన్ చాగంటి అనసూయ రాములు అన్నారు. బుధవారం మున్సిపాలిటీ పరిధిలోని అనంతారం అంగన్‌వాడీకేంద్రంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాల్లో ఆమె పాల్గొని మాట్లాడారు. బిడ్డకు తల్లిపాలను మించిన దివ్య ఔషధం మరొకటి లేదన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ నాజియా, అంగన్వాడీల సూపర్‌వైజర్ ఖైరున్నిసా, ఏఎన్‌ఎం బేబీ, అంగన్‌వాడీ టీచర్లు వెంకటమ్మ, ధనమ్మ ఆశ దసరమ్మ, ఆయాలు సునీత ,లలిత, గర్భవతులు, బాలింతలు పాల్గొన్నారు.

తల్లిపాలు అమృతంతో సమానం

అర్వపల్లి: తల్లిపాలు అమృతంతో సమానమని కోమటిపల్లి ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం వి.సైదులు అన్నారు. ఆ గ్రామ అంగన్‌వాడీ కేంద్రంలో బుధవారం తల్లిపాల వారోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ టి.శివరంజని, ఉపాధ్యాయురాలు ఆర్.స్వజన, ఆయా పద్మ, గర్భవతులు, బాలింతలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

కొత్తగూడెం రోడ్డుకు బీటీ రెన్యూవల్ చేయాలి

అర్వపల్లి: బీటీ లేచిపోయి గుంతలేర్పడి అధ్వానంగా మారిన జాజిరెడ్డిగూడెం మండలం కొత్తగూడెం రోడ్డుకు మరలా బీటీ వేయాలని గ్రామస్తులు విజ్ఞప్తి చేశారు. ఎన్నోసార్లు విన్నవించినా బీటీ వేయకపోవడంపై బుధవారం రోడ్డుపై నిరసన తెలిపారు. ఈ రోడ్డు బీటీ రెన్యూవల్‌కు నిధులు మంజూరై ఏళ్లు గడుస్తున్నా పనులు చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా బీటీ రెన్యూవల్ చేసి తమ కష్టాలు తీర్చాలని అధికారులకు విన్నవించారు. కార్యక్రమంలో రామసాని రవీందర్, పుల్లయ్య, సరోజన అలివేల, కిష్టమ్మ, భారతమ్మపాల్గొన్నారు.

విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలి


మాట్లాడుతున్న డీఎస్‌పీ శ్రీనివాసరావు

చివ్వెంల: విద్యార్థులు సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా సైబర్ సెక్యూరిటీ డీఎస్‌పీ శ్రీనివాస్‌రావు, సీఐ లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం చివ్వెంల మండలం దురాజ్‌పల్లి గ్రామ శివారులోని ప్రతిష్ట ఫార్మసీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ నేరాల పట్ల నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడారు. వాట్సాప్‌లో వచ్చిన ఏపీకే ఫైల్స్ ఇన్‌స్టాల్ చేసుకోవద్దని, లోన్ యాప్‌లో లోన్‌లు తీసుకోవద్దని, కరెంట్ బిల్లు కట్టాలని వచ్చే మోసపూరిత సందేశాలు నమ్మవద్దని సూచించారు. సైబర్ ఫిర్యాదుకు టోల్‌ఫ్రీ నంబర్ 1930, పోలీస్ సహాయం కోసం డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. అనంతరం రూరల్ సీఐ వై.సురేందర్‌రెడ్డి మాట్లాడుతూ యువత వ్యసనాలకు దూరంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయ్‌కుమార్, ఎస్‌ఐ వెంకటరత్నం పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ చేనేత దినోత్సవం


తిరుమలగిరిలో జాతీయ చేనేత దినోత్సవమ్ పాల్గొన్న నాయకులు

తిరుమలగిరి: తిరుమలగిరిలో బుధవారం చేనేత కళాకారుల సంఘం ఆధ్వర్యంలో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చేనేత రంగానికి, కార్మికుల సంక్షేమానికి కృషి చేయాలని కోరారు. చేనేత బీమా పథకాలను తక్షణమే అమలు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి వంగరి బ్రహ్మం, జయచందర్, చంద్రమౌళి, పూర్ణచందర్, శ్రీనివాస్, వెంకన్న, యాదగిరి, ప్రవీణ్ కుమార్, రాజు, మురళి, మధు, సత్యనారాయణ పాల్గొన్నారు.

బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు సన్మానం


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ఎంఈఓ, నోడల్ అధికారి

అర్వపల్లి: జాజిరెడ్డిగూడెం మండలం పర్సాయపల్లి ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు శ్రీనివాస్, సురేందర్‌లు ఇటీవల బదిలీ అయ్యారు. దీంతో వారిని బుధవారం పాఠశాలలో ఘనంగా వీడ్కోలు పలికి సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బి.బాలునాయక్ మండల నోడల్ అధికారి కె.ప్రభాకర్, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్‌పర్సన్ కుంభం అండాలు, హెచ్‌ఎం ఆచారి, ఉపాధ్యాయులు ధనమూర్తి, కోదండరామిరెడ్డి, అంగన్‌వాడీ టీచర్ సవిత, కుంభం సోమయ్య, వెంకటమ్మ పాల్గొన్నారు.

ఘనంగా గోదాదేవి తిరునక్షత్ర వేడుకలు


తిరునక్షత్ర వేడుకల్లో పాల్గొన్న భక్తులు


తుంగతుర్తి : రామాలయంలో కుంకుమార్చన చేస్తున్న భక్తులు

భానుపురి (సూర్యాపేట): పట్టణంలోని శ్రీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో గోదా అమ్మవారి తిరునక్షత్ర వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి నవకలశ తిరుమంజన స్నపనం నిర్వహించి పట్టు వస్త్రాలతో అలంకరించి గోదా అష్టోత్తర శతనామార్చన, దివ్య ప్రబంధ పఠనం జరిపారు. అనంతరం ఆలయ ప్రధాన అర్చకులు నల్లాన్ చక్రవర్తుల వేణుగోపాలాచార్యులు గోదాదేవి ప్రాశస్త్యాన్ని భక్తులకు వివరించారు. భగవంతుడి అనుగ్రహం పొందడానికి భక్తియే ప్రధానమని లోకానికి చాటింది గోదాదేవి అమ్మవారిని తెలిపారు. సాయంత్రం పూల పల్లకిలో అమ్మవారిని ఆలయసేవ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కార్యనిర్వహణ అధికారి వైశ్రీనివాసరెడ్డి, బజ్జూరి కృష్ణయ్య, టీఎస్‌వీ. సత్యనారాయణ, సుభాషిని, మంజుల, అరుణమ్మ, కవిత, పద్మ, అరుణ, మాధవి, ఆండాళ్ గోష్ఠి భక్త బృందం తదితరులు పాల్గొన్నారు.

నేడు లక్ష కుంకుమార్చన

శ్రావణమాసంలో లక్ష్మీ అమ్మవారు పుట్టిన ఉత్తరానక్షత్రాన్ని పురస్కరించుకొని గురువారం ఆలయంలో ఉదయం 10 గంటలకు సామూహిక లక్ష కుంకుమార్చన నిర్వహించనున్నట్లు ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాలచార్యులు తెలిపారు.

తుంగతుర్తి: మండలకేంద్రంలోని శ్రీపట్టాభి రామచంద్రస్వామి ఆలయంలో అండాలు తిరునక్షత్ర (గోదాదేవి)జన్మదిన వేడుకలను బుధవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు రామాచార్యులు అష్టోత్తర, కుంకుమార్చన, పారాయణం లాంటి కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను పంపిణీ చేశారు.